త్వరలో పంచాయతీ వనరుల కేంద్రం సిద్ధం కావాలి

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లా ప్రధాన కేంద్రంలో ఏర్పాటు కాబోయే జిల్లా పంచాయతీ వనరుల కేంద్రాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి సిద్ధం చేయాలని జిల్లా కలక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గుత్తేదారుని ఆదేశించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ప్రక్కన రూ.200 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించబోయే జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం స్థలాన్ని కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే జిల్లాలో వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా ఉంటుందని, అదేవిధంగా ఇతర ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించు కోవచ్చని పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లకు కలెక్టర్ తెలిపారు. అందుకే వీలైనంత త్వరగా భవన నిర్మాణ పనులను ప్రారంభించి అప్పగించాలని సూచించారు. దాదాపు 8,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమయ్యే ఈ కేంద్రాన్ని నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వి. సన్యాసిరావు, మండల ఇంజనీరింగ్ అధికారి గంటా చంద్రమౌళి, ఎస్.ఎస్ లాజిస్టిక్స్ కాంట్రాక్టర్ సురేష్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై 5శాతం రాయితీ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణ ప్రజలు మున్సిపాలిటీకి బకాయిపడ్డ ఆస్తి పన్నును ఏప్రిల్ 30వ తేదీ లోపుగా చెల్లించి 5 శాతం వడ్డీ రాయితీ పొంది పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, కొళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులను మున్సిపల్ కార్యాలయంలోగాని, సచివాలయంలో గాని ప్రజలు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ 5 శాతం రాయితీ 2025-26కు సంబంధించిన ఆస్తిపన్నులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ, సచివాలయం సిబ్బంది పట్టణ ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

ప్రతిరోజు చెత్త సేకరణ జరగాలి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: గ్రామాల్లో ప్రతిరోజు క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరగాలని, గృహాల నుండి వెలువడుతున్న వ్యర్థాలు, చెత్తాచెదారం, తడి చెత్త, పొడి చెత్తలను ప్రతిఒక్కరూ భద్రపరిచి చెత్త సేకరణకు వచ్చే అంబాసిడర్లకు అప్పగించాలని మండల ఈఓపీఆర్డీ జివి రమణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని పెదబొండపల్లి, ఎంఆర్ నగరం, చినబొండపల్లి గ్రామాల్లో పర్యటించారు. ప్రతిరోజు చెత్త సేకరణకు గ్రామాల్లో అంబాసిడర్లు వస్తున్నారా లేక విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటున్నారా....? సేకరించిన చెత్తను పిడబ్ల్యుసి కేంద్రాలకు తరలిస్తున్నారా అన్నదానిపై ఆరా తీశారు. గ్రామాల్లో జరుగుతున్న క్రాస్ ప్రోగ్రామ్ పనులను పర్యవేక్షించారు. మండల పరిధిలో గల ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ పర్యటనలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అల్లువాడలో మండల ప్రత్యేక అధికారి సందర్శన

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ పంచాయతీలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా మండల ప్రత్యేక అధికారి జిల్లా పంచాయతీ విస్తరణ అధికారి కొండలరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ గ్రామంలోని గ్రీన్ అంబాసిడర్లు సేకరించి విధానాన్ని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఎస్.డబ్ల్యూ.పి.సి షెడ్‌కు వెళ్లి అక్కడ ఉన్న పొడి తడి చెత్త వేరు చేయు విధానం సరిగ్గా లేకపోవడంతో పరిస్థితిని పరిశీలించిన ఆయన పంచాయతీ కార్యదర్శిపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసి తదుపరి సందర్శనకు వచ్చేనాటికి వర్మి కంపోస్టు సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఈయనతో పాటు ఈ కార్యక్రమంలో ఎంపిపి బొంగు సురేష్, ఎంపిడిఓ శంభంగి రమేష్, మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.సి.హెచ్ ప్రసాద్, గ్రామ సర్పంచ్ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం బిజెపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు.

కుట్టు మిషన్లు పంపిణీ

విశాలాంధ్ర - కురుపాం: స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు రాష్ట్ర విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని గొటివాడ పంచాయతీ నేరేడువలస స్వార్డ్ సంస్థ డైరెక్టర్ బి.దయానంద్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. కుట్టు మిషన్‌ల ద్వారా మహిళలకి కుటుంబ పనులతో పాటు, ఆర్థికంగా ఎదుగుదలకు ఉపయోగపడు తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, మాజీ ఎంపీపీ రమణమూర్తి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా, సర్పంచ్, ఉప సర్పంచ్, స్వార్డ్ సంస్థ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నల పర్వం

విశాలాంధ్ర - వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి విశిష్ట అతిథులు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ పద్దులకు సంబంధించి తహసిల్దార్ సిహెచ్ సత్యనారాయణ మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మండలంలో ఎన్ని రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి... ఎన్ని గ్రామాలు పూర్తి చేశారు... ఇంకా ఎన్ని గ్రామాలు పూర్తి చేయవలసి ఉందని ఆరా తీశారు. చలివేంద్రి గ్రామ ఎంపీటీసీ పో రెడ్డి వెంకట నాయుడు డ్రోన్ కెమెరాలు మా ఊరు చుట్టూ తిప్పలేదని, వివరించగా ఏ విధమైన తప్పులు ఉన్నా వాటికి సంబంధించిన పత్రాలు తీసుకువస్తే సరి చేయడం జరుగుతుందని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ వివరణ ఇచ్చారు. వ్యవసాయ శాఖ పద్దులకు సంబంధించి ఏవో సౌజన్య మాట్లాడుతూ చలివేంద్ర ఎంపీటీసీ పోరెడ్డి వెంకట్ నాయుడు గత ప్రభుత్వంలో మా గ్రామానికి ట్రాక్టర్ మంజూరు చేశారని, ఇంజిన్ తప్ప ట్రక్కు ఇవ్వలేదని ప్రశ్నించారు.

ఏఐఎస్ఎఫ్ విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బెలగాం: ఏఐఎస్ఎఫ్ విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయవలసినదిగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యారంగం సంక్షోభంలో ఉందని, అశాస్త్రీయ భావాలతో విద్యార్థుల మనస్సు విచ్ఛిన్నమైన విద్యా వ్యవస్థను కాషాయికరణ చేస్తున్నారని అన్నారు. కడప జిల్లా వేదికగా ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాల నిర్వహణలో ఏఐఎస్ఎఫ్ ముందుందని అన్నారు. విద్యార్థుల గుండెచప్పుడు ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. అలాగే భవిష్యత్తులో జరగబోయే విద్యా వ్యతిరేక పోరాటాలు గురించి జరగబోయే తరగతులు ఒక వేదిక కాబోతున్నాయన్నారు. విద్యావేత్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు, అందరూ జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు బుజ్జి, వికాస్, మనీ, సంతోష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత వాడలో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

విశాలాంధ్ర - బలిజిపేట: పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బలిజిపేట మండలం గంగాడ గ్రామంలోని దళిత వాడకు వెళ్లి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కూర్చొని అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను తెలుసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా తాను అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ముందుంటానని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నట్టు అక్కడ మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, నీటి సరఫరా విభాగం అధికారులతో అక్కడికక్కడే ఎమ్మెల్యే మాట్లాడి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.ఆరు లక్షలతో దళితవాడకు ఇంటింటి కుళాయిలు వేయాలని ఆయన ఆదేశించారు. అక్కడి శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ఎస్సీ వీధిలో 100 గృహాలు ఉన్నప్పటికీ నేటి వరకు పైపులు లేకుండా ఎలా నీటి సరఫరా చేశారని అధికారులపై మండిపడ్డారు. సత్వరమే ఆ వీధికి తాగునీటి సదుపాయం కల్పించాలని ఆయన నీటి సరఫరా విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్‌కు ఆదేశించారు. గ్రామంలోని సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావడంలేదని ఎంపీడీవో నగేష్‌తో మాట్లాడి ఉద్యోగుల పనితీరు బాగోలేకపోతే చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ కరుణకుమార్, జేఈ పవన్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు పి.వేణుగోపాల్ నాయుడు, టీడీపీ కొప్పలవెలమ స్టేట్ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, బీసీ సెల్ అరకు పార్లమెంట్ అధ్యక్షులు బూరాడ రామ్మోహన్రావు, నాయకులు గౌరీ శంకర్రావు, రాధాకృష్ణ, చైర్మన్ గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్త పాటించాలి

విశాలాంధ్ర - కొమరాడ: వేసవి కాలం దృష్ట్యా ప్రజలు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. శుక్రవారం చిన మార్కొండపుట్టి గ్రామంలో ఉపాధి హామీ వేతనదారులకు వడదెబ్బ, డీహైడ్రేషన్‌లకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించి అవగాహన కల్పించారు. వేసవి రీత్యా ఉష్ణోగ్రతల కారణంగా శరీరం నీరు, లవణాలు కోల్పోతుందని వాటిని ఎప్పటికపుడు భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని లేకపోతే డీహైడ్రేషన్ తద్వారా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. నీరు, నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఇంకా ఇంటి వద్ద అందుబాటులో ఉన్న అవసరమైన ద్రావణాలు త్రాగుతూ ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ పరశురాంపురంలో ఎఫ్.డి.పి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొమరాడ వైద్యాధికారి డాక్టర్ ఎం.శిరీష, పిహెచ్ఎన్ విజయకుమారి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొట్టాపు తిరునాథ, సన్యాసిరావు, ఎపిడమిక్ ఈవో సత్తిబాబు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బి.సావిత్రి, వైద్య సిబ్బంది అనూష, పార్వతి, రమేష్, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ బోగస్ కుల ధ్రువపత్రాలపై విచారణ



విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏలో అక్రమ బోగస్ కుల ధ్రువపత్రాలకు సంబంధించిన డీఎల్‌సీ విచారణను శుక్రవారం ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా బోగస్ కుల దృవీకరణ పత్రాలు పొందినట్లు విచారణ ఎదుర్కొంటున్న వారిని పీవో విచారించారు. ఈ సందర్భంగా వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. అదే విధంగా మరిన్ని ఆధారాలు సేకరించి పూర్తి వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్న దొర, సూపరింటెంట్ దేశ్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని కోటసీతారాంపురం ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి జి.సూరిదేముడు శుక్రవారం సందర్శించారు. పాఠశాలను వార్షిక తనిఖీ చేపట్టారు. రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చుక్క శ్రీదేవి, సీఆర్పీలు దామోదర రావు, అనసూయ, రతీదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, దాలయ్యలు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలకు అపార నష్టం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - చింతపల్లి: మన్య ప్రాంతంలో ప్రకృతి సహజ సిద్ధంగా నిక్షిప్తమై ఉన్న ఖనిజ సంపద దోచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ. సత్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక గిరిజన ఉద్యోగ భవనంలో ఆ పార్టీ జిల్లా సమితి సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండల కార్యదర్శి పి.పోతురాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణతో కలిసి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మన్య ప్రాంతంలో ప్రకృతి సహజ సిద్ధమైన ఖనిజ సంపద ఉందని, కోట్ల విలువైన బాక్సైట్ గనులు, లేటరైట్ నిక్షేపాలు ఉన్నాయన్నారు. మైదాన ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను ఇప్పటికే వెలికితీయడం జరిగిందని, ఈ ప్రాంత ఖనిజ సంపదపై కేంద్ర ప్రభుత్వం కన్ను పడిందన్నారు. గిరిజనులను ఈ ప్రాంతం నుంచి వెళ్లగొట్టి ఖనిజ సంపద తవ్వకాలు నిర్వహించేందుకు కార్యచరణ ప్రారంభించి ఒదన్నారు. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించిందన్నారు. ప్రత్యేక పోలీసు బలగాలతో ఆదివాసీ గ్రామాల్లో కూంబింగ్ లు నిర్వహి స్తున్నారని, యుద్ధభూమిని తలపిస్తున్నాయన్నారు. ఈ ఆపరేషన్ వలన అమాయక గిరిజనులు మృత్యువాత పడే అవకాశముందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రబొమ్మల ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సత్తిబాబు, కొండలరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, మండల కార్యదర్శి పేట్ల పోతురాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ రెహ్మాన్, గంజారి రమణ, ఇరువాడ దేముడు, లక్ష్మణ్, రాధకృష్ణ, సతీష్, సింహాచలం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకు అధిక ప్రాధాన్యత

గైనకాలజిస్ట్ డా. అస్మా అక్తర్

విశాలాంధ్ర - చింతపల్లి: సాధారణ ప్రసవాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహించాలని చింతపల్లి ఏరియా ఆసుపత్రి డిప్యూటేషన్ వైద్యురాలు, గైనకాలజిస్ట్ డాక్టర్ అస్మా అక్తర్ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సాధారణ ప్రసవాల వలన తల్లి త్వరగా కోలుకోవడంతోపాటు ప్రసవం జరిగిన మొదటి అరగంటలోనే తల్లి శిశువుకు పాలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. సాధారణ ప్రసవమయిన వారు ఆసుపత్రిలో రెండు లేదా మూడు రోజులు ఉంటే సరిపో తుందని ఆమె వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల వలన తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, అదే అత్యవసర పరిస్థితుల్లో గాని, బిడ్డ అడ్డం తిరిగినప్పుడు గాని శస్త్ర చికిత్స చేయడం జరుగుతుందని, శస్త్ర చికిత్స చేసిన తర్వాత బాలింత సాధారణ స్థితికి రావడానికి మూడు నుంచి ఆరు మాసాల సమయం పడుతుందని అందువలన సాధారణ ప్రసవాలకే మొగ్గు చూపాలన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఎన్నో ఉపయోగాలు

విశాలాంధ్ర - జీకే వీధి: సేంద్రియ వ్యవసాయం పర్యావరణానికి మేలని, సేంద్రీయ వ్యవసాయంతో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించగలమని సేంద్రీయ వ్యవసాయం రైతులకు లాభదాయకమైన మార్గమని తహశీల్దార్, మండల సేంద్రియ వ్యవసాయ చైర్మన్ టి రామకృష్ణ అన్నారు. శుక్రవారం జీకే వీధి మండలం చాపరాతి పాలెం గ్రామ రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై పలు సూచనలు, సలహాలు చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే విధంగా రైతులను ప్రోత్సహించి పీఎం ప్రణామ్ పథకం ద్వారా సేంద్రియ వ్యవసాయంతో రైతులు సాధించే సాగు దిగుబడులు, లాభాల గురించి పథకం విశిష్టతల గురించి వివరించారు. ఆర్గానిక్ వ్యవసాయంతో పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం వలన కాలుష్యం ప్రమాదాన్ని తగ్గిస్తుందన్నారు. సేంద్రియ ఆహారం తీసుకోవడం వలన ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్ పాల్గొన్నారు.

మీకోసంకు 105 ఫిర్యాదులు

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు 105 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, డిఆర్ఓ కె.పద్మలత వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీ లుగతంగి గ్రామానికి మెయిన్ రోడ్డు నుండి గ్రామం వరకు సిసి రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు కె.లక్ష్మణరావు, ఎస్.భీమేశ్వరరావు వినతి పత్రం సమర్పించారు. గిరిజన ప్రాంతంలో వాటర్ ప్లాంటులు పెట్టి తాగునీటిని విక్రయిస్తూ వ్యాపారాలు సాగిస్తున్నారని అటువంటి తాగునీటిని, తాగునీటి ప్లాంట్లను తనిఖీ చేయాలని ఆదివాసీ పరిషత్ ఉపాధ్యక్షులు వంతాల నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. చింతపల్లి మండలం లబ్బంగి పంచాయతీ చెక్ మరమ్మతులు చేపట్టాలని డి. మోహనరావు, డి. జగన్నాథం తదితరులు వినతి పత్రం అందజేసారు. అనంతరం ఇద్దరు డిగ్రీ విద్యార్థులు దివ్యాంగులు వంతాల ఓనోత్, వంజంగి మంజు ప్రియలకు ల్యాప్టాప్లను పంపిణీ చేసారు. ఇంటర్మీడియట్ ఆపైబడి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు టచ్ ఫోన్లకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

మల్టీపర్పస్ భవన నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: పివిటిజి గ్రామాలకు మంజూరు చేసిన మల్టీపర్పస్ భవన నిర్మాణాలు వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకుని రావాలని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వెంకటేశ్వరరావు, వి. ఎస్. ప్రభాకరరావులు అన్నారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ (విద్య) , విద్యాశాఖ, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్యశాఖ, వెలుగు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి జన్ మన్ కార్యక్రమంలో పాడేరు ఐటిడిఏ పరిదిలోని పివిటిజి గ్రామాలకు 34 మల్టీపర్పస్ భవనాలు మంజూరయ్యాయని చెప్పారు. పాఠశాల భవనం, అంగన్వాడీ కేంద్రం, హెల్త్ సబ్ సెంటర్లు లేని పివిటిజి గ్రామాల్లో మల్టీపర్పస్ భవనాలను నిర్మిస్తున్నారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.60 లక్షల వ్యయం చేయడం జరుగుతుందన్నారు. మల్టీపర్పస్ భవనాల్లో సొంత భవనం లేని అంగన్వాడీ కేంద్రం, సబ్ సెంటర్ల పాఠశాల ప్రాథమిక పాఠశాలలను తరలించాలన్నారు. మల్టీపర్పస్ భవనాలకు పూర్తి స్థాయిలో విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇ జి. దేవిడ్ రాజు, ఉప సంచాలకులు ఎల్. రజని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ భాషా, జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, ఐసిడి ఎస్ పిడి ఎన్. సూర్య లక్ష్మి, వెలుగు ఎపిఎం వి. ఎస్. ప్రసాద్ 11 మండలాల సిడిపి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - హుకుంపేట: బాల్య వివాహాలపై అవగాహన సదస్సును సూకూరు సర్పంచ్ దంసాని సత్యవతి ఆధ్వర్యంలో చాట్రాయిపుట్టు గ్రామంలో నిర్వహించారు. గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరు బాల్య వివాహాలపైన అవగాహన కలిగి ఉండాలని ఆమె అన్నారు. బాల్యవివాహాలు చట్టానికి వ్యతిరేకంగా పాల్పడినచో జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఆమె తెలిపారు. ప్రతి ఒక తల్లి దండ్రులు విద్యపై మక్కువ చూపాలని ఆమె కోరారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ సిహెచ్ బాలమణి దేవి మాట్లాడుతూ శిశు మరణాలకు తావు లేకుండా ఆరోగ్యాలపై దృష్టిసారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ హైమావతి, స్థానిక నాయకులు మురళి, వార్డ్ మెంబర్లు, పీసా కమిటీ ప్రెసిడెంట్, మహిళ పోలీస్ సుభాషిణి, వీఆర్ఓ కొండమ్మ, పాఠశాల హెచ్ఎం పద్మ, ఏఎన్ఎం పూర్ణ, ఆశలు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - పాడేరు: ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఇంటర్ కళాశాలలకు నోట్ అలాగే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య అలాగే నోట్ పుస్తకాలను స్థానిక ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాస్‌రావు విద్యార్థులకు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గతంలో విద్యాసంవత్సరం చివరికి కూడా పుస్తకాలు విద్యార్థులకు అందేవి కావని, ప్రస్తుత ప్రభుత్వం దానికి భిన్నంగా చరిత్రలో ఎన్నడూ లేని విదంగా విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండా ముందుగానే పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తోందన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

విశాలాంధ్ర - జీకే వీధి: గూడెం కొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ ఏబులం గ్రామంలో జాతర సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మత్స్యరస విశ్వేశ్వరరాజు పాల్గొని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, అల్లూరి సీతారామరాజు జిల్లా కోశాధికారి కుందేరి రామకృష్ణ, వైసీపీ నాయకులు నారాయణ, రామ్మూర్తి, గ్రామ పెద్దలు గ్రామ యువత పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలో గల ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సంతారి, ఓల్డ్ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలలో మలేరియా సీజనల్ వ్యాధుల పట్ల జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి, విహెచ్‌సి సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం జంకరం పుట్టు గ్రామంలో ఇంటికి ఇంటికి వెళ్లి దోమ తెరలు సక్రమంగా వినియోగంపై తనిఖీ చెపట్టా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. అనంతరం ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యం రక్త పరీక్షలు నిర్వహించే పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాణా ప్రతాప్, మలేరియా అధికారులు జి.శ్రీను, ధనుర్జయి, నూకరాజు, వైద్య సిబ్బంది ఏఎన్ఎం చంద్రమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - సీలేరు: గిరిజనులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే.హిమబిందు అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెరుకుమల్ల గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో 102 మందికి వైద్యాధికారి ఆరోగ్య తనిఖీలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హిమబిందు మాట్లాడుతూ వాతావరణంలో కలిగిన మార్పుల వల్ల గిరిజన గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరాలను నిర్లక్ష్యం చేయరాదని, నాటు మందులు పసరు మందులకు అవకాశం ఇవ్వరాదని ఆమె తెలిపారు. గర్భిణులు విధిగా ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలని, ప్రసవ సమయానికి పది రోజులు ముందే ఆసుపత్రిలో చేరాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్ హెచ్‌పి లవకుమారి ఏఎన్ఎంలు సీత, మత్స్యకొండ పాల్గొన్నారు

స్థాపితం:1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు
అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కింది తెలపబడిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతాలు :
రంపచోడవరం, వై.రామవరం, గంగవరం, అడ్డతీగల.
సంప్రదించవలసిన నెం :
డి.యర్రయ్యరెడ్డి, జిల్లా బ్యూరో చీఫ్
7989138129

టీడీపీ నేతను పరామర్శించిన గిడ్డి ఈశ్వరి

విశాలాంధ్ర - జీకే వీధి: గూడెం కొత్త వీధి మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పొత్తూరు కొండలరావు గత రెండు రోజుల క్రితం పశువులు బయటికి వంపే క్రమంలో ప్రమాదవశాత్తు గోతిలో పడిపోవడంతో కుడికాలు, వేళ్ళు, ఎముకలు చిట్లి పోయాయి. చికిత్స అనంతరం ఆయన చింతపల్లి తన కుమార్తె ఇంటిలో విశ్రాంతి పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి శుక్రవారం చింతపల్లి ఆయన కుమార్తె ఇంటికి వెళ్లి పోత్తూరు కొండలరావుకు పరామర్శించి

యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మొక్కల రమేష్, టిడిపి మండల యువత అధ్యక్షుడు ముర్ల కోటేశ్వరరావు, కె. తెల్లన దొర మాజీ ఎంపిటిసి, శెట్టి రామారావు మాజీ వైస్ సర్పంచ్,జీకే విధి చింతపల్లి తెదేపా కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహిస్తూ జీవనోపాధి పెంచాలి

ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి సాధించాలి
జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - గురుగుబిల్లి : జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన రంగాలతో ఉజ్వల భవిష్యతు ఉండబోతుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర వద్ద గల డా.వై.యస్.ఆర్.ఉద్యానవన కళాశాలలో ఖరీఫ్ పంటల సాగులో ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన పద్ధతులను అవలంభించి, లాభసాటి వంటల ద్వారా రైతులకు అధిక ఆదాయం సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. తద్వారా రైతులను ప్రోత్సహిస్తూ, వారి జీవనోపాధులు మెరుగుపడాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లాలో వరి పంటతో పాటు కంది, చిరుధాన్యాలు, నిమ్మబడ్డి వంటి వాటికి అనుకూలమని, కావున వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి అంతర పంటల దిశగా రైతులను ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా రాగి (రాగులు) పంటకు జిల్లాలో మంచి గిరాకీ ఉందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని, నూతన పద్ధతుల ద్వారా ఎకరాకు 10 క్వింటాళ్ల రాగులు దిగుబడి వచ్చేలా రైతులను ప్రోత్సహించాలని కలక్టర్ తెలిపారు. కాలానుగుణంగా పంటల మార్పిడి, పద్ధతులు ఉండాలని, అందుకు తగిన విధంగా రైతులకు శిక్షణ కార్యక్రమాలు, ఎక్స్ పోజర్ విజిట్స్, కొత్త విధానాలు అవలంభించడం వంటి వాటిపై రైతులను చైతన్యపరచాలని అన్నారు. ఇందుకు ప్రతి గ్రామం నుంచి ఆసక్తి, ఉత్సాహం ఉన్న రైతును ఎంపిక చేసుకొని, ఆ రైతు ద్వారా గ్రామంలోని ఇతర రైతులకు అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా రైతులకు ఎప్పటికపుడు సమాచారాన్ని చేరవేయాలని, జూన్ మాసాంతంలోగా రైతులకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా సాగులో మెళకువలు, జీవామృతం వినియోగం, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, ఇతర పథకాలు వంటి వాటిపై వీడియో, రాత పూర్వక సమాచారాన్ని వాట్సాప్ కు అనుసంధానిస్తామని కలెక్టర్ సూచించారు. %ూవీణూ గ్రతీవ వీశీఅంశీశీఅ ణతీఎ ాప్తశీషఱఅన్ర%)ను విస్తృతం చేయాలన్నారు. రుతుపవనాలకు ముందు తక్కువ నీటి సాంద్రతతో

రసాయనిక పద్ధతులు లేకుండా విభిన్న వంటల శ్రేణితో బలమైన అంకురోత్పత్తిని రైతులు పొందవచ్చని, తద్వారా కరువు,చీడపీడలను పంటలు తట్టుకోగలవని, అలాగే అధిక దిగుబడి, ఆదాయం లభిస్తుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక అధికారులు కె. రాబర్ట్ పాల్, బి.మాధవి, డా. ఎస్.మన్మధరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా నీటి యాజమాన్య సంస్థల పథక సంచాలకులు సుధారాణి, కె.రామచంద్ర రావు, కేవికె శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, ఇతర అధికారులు, మండల, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు తొండం దెబ్బకు పాక్షికంగా దెబ్బతిన్న వ్యాన్

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలో గురువారం రాత్రి సుభద్రమ్మ వలస గవరంపేట గ్రామాల మధ్య రాష్ట్ర ప్రధాన రహదారిపై తిరుగుతూ రహదారిపై ఆగి ఉన్న వ్యాన్ ను పరిశీలించిన ఏనుగు వ్యాను అద్దంపై తొండం వేయడంతో అద్దం పాక్షికంగా దెబ్బ తిన్నది. గత మూడు రోజులుగా ఏనుగులు గుంపు సుభద్రమ్మ వలస పెదమేరంగి కూడలి కన్నపుదొర వలస వెంకటరాజపురం గ్రామాల మధ్యనే సంచరిస్తూ ఉన్నాయి. ప్రస్తుతం అవి సుభద్రమ్మ వలస వెంకట రాజపురం గ్రామాల మధ్య తిష్ట వేసి ఉన్నాయి. వాహన చోదకులు కొద్దిగా జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా రాత్రి ప్రయాణం చేసే వాహన చోదకులు మరింత అప్రమత్తంగా ఉండాలని కురుపాం అటవీ శాఖ రేంజర్ గంగరాజు అన్నారు. ప్రస్తుతానికి ఏనుగుల గుంపులో పిల్ల ఏనుగు ఉన్నందున ఏనుగులు కొద్దిగా అప్రమత్తతతో ఉంటాయని ఆయన అన్నారు కాగా గురువారం రాత్రి ఒక వ్యాన్ పై ఏనుగులు దాడి అవాస్తమని ఆయన అన్నారు. ఆగి ఉన్న వ్యాను అక్కడ ఉండడంతో అందులో ఏవైనా ఆహార పదార్థాలు ఉన్నాయా అని చూసి అవి అక్కడి నుండి పక్కకు వెళ్తున్న క్రమంలో అద్దంపై తొండం వేయడం వల్ల కొద్దిగా అర్ధం పగిలిందని అన్నారు. అయితే తన వ్యానుకు ఏమీ జరగలేదని వ్యాన్ యజమాని పొట్లూరు మధుసూదనరావు స్పష్టం చేశారు.

10న పండ్లతోటల బహిరంగ వేలం

ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

విశాలాంధ్ర - పార్వతీపురం: 2025-26 సం.రంనకు గాను గుమ్మలక్ష్మీపురం మండలం సవర కోటపాడులో హెచ్.ఎన్.సి.టి.సి.ఫారంలో గల జీడిమామిడి, కొబ్బరి, సపోట, మామిడి పండ్ల తోటలు, కురుపాం మండలం రస్తా కుంటుబాయిలో జీడిమామిడి తోటకు సంబంధించి ఫలసాయం బహిరంగ వేలం ద్వారా విక్రయించడానికి గిరిజన రైతుల నుండి టెండరు దరఖాస్తులను కోరుతున్నట్లు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తును పథక నిర్వహణాధికారి ఐటిడిఎ పార్వతీపురం లేదా హెచ్.ఎన్.సి.టి.సి నర్సరీ, సవరకోటపాడు వద్ద రూ.200/-లు చెల్లించి పొందవచ్చని అన్నారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు గిరిజన రైతుల నుంచి దరఖాస్తులను కార్యాలయపు పనిచేయు వేళలో స్వీకరించబడునని వివరించారు. వేలం 10వ తేదీ ఉదయం 10.30 గం.లకు గిరిమిత్ర సమావేశ మందిరం ఐటిడిఎ ప్రాంగణం పార్వతీపురంలో జరుగునని తెలిపారు. ఏ కారణం తెలుపకుండా వేలం పాటను రద్దుచేయు అధికారం, అగ్రిమెంట్ ను సవరించు లేదా మార్పుచేయు అధికారం పోజెక్టు అధికారికి సర్వహక్కులు ఉన్నాయని అన్నారు. ఆసక్తి గల గిరిజన రైతులు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

వడదెబ్బలకు గురికాకుండా ఉండాలి: ఎంపిపి శోభారాణి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: వివిధ గ్రామాల నుంచి వ్యక్తిగత సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు వచ్చినా అర్జీదారులు సకాలంలో కార్యాలయానికి చేరుకోవాలని రోజురోజుకు వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బలకు గురికాకుండా ఉండాలని ముఖ్యంగా వ్యక్తిగత జాగ్రత్త తీసుకోవాలని ఎంపిపి ఎం. శోభారాణి అన్నారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి వారి పనులను ఉదయం పూట ముగించుకోవాలని ప్రయాణ వేళల్లో మంచినీరుతో పాటు మజ్జిగ వంటివి వెంట తీసుకువెళ్లాలని మండల ప్రజలను కోరారు. మండల పరిధిలో గల అనేక కూడళ్ల వద్ద ప్రభుత్వ ఆదేశాల మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బలగ రేవతి, ఎంపిడిఓ ఎంజి రమేష్, పిఓపిఆర్డి రమణమూర్తి కార్యాలయ సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర నోట్ బుక్స్ పంపిణీ



విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాజు అధ్యక్షతన సీనియర్ అసిస్టెంట్ చినబాబు చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా వచ్చిన వైట్ నోట్ బుక్స్ 6 రూల్ నోట్ బుక్స్ 6, ఒక్కొక్క విద్యార్థికి మొత్తం 12 నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఇంటర్ షెడ్యూల్ మారింది ఎందుకంటే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కూడా ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలతో పోటీపడేలా విద్యార్థులకు ఈ సంవత్సరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఏప్రిల్ ఒకటి నుండి విద్యార్థులకు ఏప్రిల్ 24 వరకు కళాశాలలో తరగతులు జరుగుతాయని విద్యార్థులందరూ హాజరుకావాలని తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో కళాశాల అతిధి అధ్యాపకులు ఇంగ్లీష్ టీచర్ ఎస్ నరసింహారావు ఫిజిక్స్ అధ్యాపకులు జీ వెంకటేశ్వర్లు, బోటనీ అధ్యాపకులు జి శివరాజు , కే బాలు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులపై అవగాహన



విశాలాంధ్ర - సీతంపేట: మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలోని పాత రేగులగూడ గ్రామంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట ఎరువులు, పురుగులు, తెగుళ్లపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ పాలక నాగేశ్వరరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, జీలుగు, పిల్లిపెసర 9 నుంచి 18 రకాలు విత్తనాలు భూమిలో వేసి దున్నడం వల్లన భూమిలో పోషకాలు పెరిగి మంచి పంట దిగుబడి వస్తుందన్నారు. సైంటిస్ట్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చిరుధాన్యాలు ప్రాముఖ్యత గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మతోన్మాద ఎజెండా అమలులో భాగంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తుందని సిపిఎం పార్టీ వ్యాఖ్యానించింది. వక్ఫ్ సవరణ బిల్లు అమలుకు పార్లమెంట్లో ఆమోదం పొందిన దానిని వ్యతిరేకిస్తూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పార్వతీపురం బంగారమ్మ కాలనీ, పాలకొండ రోడ్డులో గల మసీదులలో కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్ మాట్లాడుతూ బిజెపి అధికారం చేపట్టినప్పటి నుండి లవ్ జిహాద్, ఘర్వాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం, మూక హత్యలతో మతోన్మాద శక్తులు తలపడుతున్నాయని, ఇప్పుడు సరికొత్తగా వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందని తెలిపారు. ఈ చట్టం ఆస్తుల కబ్జా చేయడానికి తప్ప, వక్ఫ్ ఆస్తులు అభివృద్ధికి కాదని అన్నారు. బిజెపి దుర్మార్గమైన సవరణలు చేస్తూ ముస్లిం ప్రజల ఆస్తులపై యుద్ధం ప్రకటించే ఈ బిల్లును లౌకిక పార్టీలుగా చెప్పుకునే టిడిపి, జనసేనతో సహా మరికొన్ని పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాలకై బలపరచడంతో గురువారం పార్లమెంట్ సమావేశంలో ఈ బిల్లు ఆమోదం పొందిందని, టిడిపి జనసేనల వైఖరి లౌకికత్వానికి విఘాతం కలిగించేలా ఉన్నాయని వాపోయారు. సిపిఎం పార్టీతో సహా మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లును పార్లమెంటులో గట్టిగా ఎదుర్కొన్నాయని అన్నారు. ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులను శాశ్వతంగా వక్ఫ్ ఆస్తులుగానే ఉంటాయని వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికి లేదని గతంలో సుప్రీంకోర్టు తీర్పించినప్పటికీ, దానికి వ్యతిరేకంగా బిజెపి ఈ చట్టం చేయబడిందని ఇది చాలా దుర్మార్గమని మండిపడ్డారు. భారత రాజ్యాంగంలోని 25, 29, 30 తదితర నిబంధనకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడిందని, మసీదులు, దర్గాలు, స్మశానాలు ఇప్పుడు మరింత ప్రమాదంలో పడనున్నాయని వివరించారు. లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టబడతాయని, ఇతర మతాలవాళ్లను వక్ఫ్ బోర్డు సభ్యుల్లో చేర్చి వాటిని వివాదాస్పదం చేసే కుట్ర ఈ సవరణ బిల్లులో ఉన్నదని, ఇది భారత ప్రజలను మతపరంగా విభజించే కుట్రలో భాగంగా చేయబడిందని, కావున లౌకిక, మైనారిటీ శక్తులన్ని సమైక్యంగా ముందడుగు వేయాలని దీన్ని తీవ్రంగా వ్యతిరేకించి ప్రతిఘటించాలని కోరారు.

మన్యంలో కూటమి నేతల పరిస్థితి అగమ్య గోచరం

టీడీపీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య

విశాలాంధ్ర - చింతపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా మన్యంలో ఆ కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని టీడీపీ సీనియర్ నాయకుడు, మండల ఉపాధ్యక్షుడు కిముదు లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గడచిన ఐదేళ్ళు వైసీపీ ప్రభుత్వంలో అష్ట కష్టాలు పడినప్పటికీ పార్టీ బలోపేతం, విజయమే లక్ష్యంగా కృషి చేస్తే, ఆ కృషి ఫలితంగా నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11. నెలలు 20 రోజులు కావస్తున్నా, మన్య ప్రాంతంలో టీడీపీ, జనసేన, బిజెపి నాయకుల, కార్యకర్తల పరిస్థితి అప్పటి తీరుగానే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కష్ట కాలంలో కూడా పార్టీని నమ్ముకుని ఉన్నవారిని కాదని నేటికీ వైసీపీ ప్రభుత్వంలో తమను ఇబ్బందులకు గురి చేసిన వారికే కూటమి ప్రభుత్వం పనులు కల్పించి వారినే ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సహకరించడం బాధ కలిగిస్తోందన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి మన్య ప్రాంతం ఆ పార్టీకి కంచుకోటగా పార్టీ శ్రేణులు ఉన్నారన్నారు. పార్టీ అధిష్ఠానం పెద్ద మనసుతో ఆలోచన చేసి పార్టీలో సీనియర్ నాయకులను గుర్తించాలని, అదే క్రమంలో పార్టీ బలోపేతం కోసమే పరితపించి అదే పార్టీలో ఉంటూ మరణించిన నాయకుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆయన కోరారు.

జోగంపేటలో జిల్లాస్థాయి ఈఎండిపి కార్యక్రమం

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని జోగంపేట గ్రామంలో ఉన్న కేజీబీవి విద్యాలయంలో జిల్లాస్థాయి (ఈఎండిపి)ఔత్సాహిక పారిశ్రామిక వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం జరిగింది. విద్యార్థి దశనుండే పారిశ్రామిక ఆలోచనలు కలగాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం ప్రారం భించినట్లు తెలిపారు. 21వ శతాబ్దపు నైపుణ్యాలను విద్యార్థులకు అంద చేయడంలో భాగంగా ఈకార్యక్రమం అమలుజరుగుతుందన్నారు. కమ్యూనికేషన్ , సమస్య పరిష్కారం మరియు పరస్పర సహకారం అనే నైపుణ్యాలను ఈకార్యక్రమం ద్వారా సాధిస్తారని చెప్పారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులకు ప్రతీ శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, ఖర్చు మొదలైన అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 40 స్కూల్స్ నుండి 5ప్రాజెక్ట్స్ చొప్పున మొత్తం 200 ప్రాజెక్ట్స్ రాగా, ఆన్లైన్ ఫిల్ట్రేషన్ తరువాత టాప్ 10 ప్రాజెక్ట్స్ ను జిల్లాస్థాయికి ఆహ్వానించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.జిల్లా సైన్స్ అధికారి గిరడ లక్షణరావు ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ మేనేజర్ అనూష అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. జిల్లావిద్యాశాఖధికారి రమజ్యోతి చరవాణి ద్వారా విద్యార్థులకు సందేశాన్ని అందించారు . జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రెడ్డి తేజేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి అమూల్య సందేశాన్ని అందించారు.విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విక్రామపురానికి వేస్ట్ మేనేజ్మెంట్లో ప్రథమ బహుమతులను వి.గీతాంజలి, ఎస్.హరిసువర్ణలకు అందజేశారు. కొమరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎల్.సిరివెన్నెల, ఎం.జాష్మిత, బి.డింపుల్‌కు ద్వితీయబహుమతి అందజేశారు. పాలకొండ మండలంలోని స్కూలుకు మూడవ బహుమతి, మక్కువ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కన్సోలేషన్ బహుమతి అందజేశారు.ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జి. సూరిదేముడు, ఎం వెంకటరమణ,జ్యూరీ మెంబెర్ ఎస్. శ్రీనివాసరావు, ఎన్ జి వి డీసీ జి. రాజారావు, పాఠశాల ప్రిన్సిపాల్ జొన్నాడ సంధ్య, ఫిజిక్స్ టీచర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాలలో తాగునీటి సమస్య తలెత్తరాదు

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

విశాలాంధ్ర - పార్వతీపురం : గిరిజన ప్రాంతాలలో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఛాంబరులో పిఎం జన్ మన్, గిరి ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సరఫరాపై ఆయా శాఖల అధికారులతో పిఓ సమీక్షించారు. పిఎం జన్ మన్ పథకం కింద మంజూరైన గృహాలను సకాలంలో పూర్తిచేయాలని తెలిపారు. ముఖ్యంగా చివరిదశలో ఉన్న గృహాలపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ప్రభుత్వం బిసి, ఎస్సిలకు రూ.50,000/-లు, ఎస్టీలకు రూ.75,000/-లు, పీవీటీజీలకు రూ.1,00,000/-లు అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రకటించిన సంగతిని లబ్ధిదారులకు అవగాహన కల్పించి, త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే గృహ నిర్మాణాలు జరిగే ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఆ దిశగా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని పిఓ స్పష్టం చేశారు. వేసవి కావడంతో గిరి ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సమస్య ఉండరాదని, తాగునీటి పరీక్షలు నిర్వహించాలని, క్రమం తప్పకుండా క్లోరినేషన్ జరగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్, గృహనిర్మాణ సంస్థ పథక సంచాలకులు పి. ధర్మచంద్రారెడ్డి, ఐటిడిఎ ఎపిఓ మురళీధర్, గృహ నిర్మాణ సంస్థ, గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్య నిర్వాహక, ఉప కార్యనిర్వాహక, సహాయ ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సులు వినియోగంలోకి తేవాలి

విశాలాంధ్ర - బెలగాం: ప్రముఖ సినీనటుడు సోనూసూద్ జిల్లాకు ఇచ్చిన అంబులెన్సును వినియోగంలోకి తీసుకుని రావాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేసారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసారు. సోనూసూద్, మరొక సంస్థ అంబులెన్సులను ఇచ్చి నెలలు గడిచిన వాటిని జిల్లా అధికార యంత్రాంగం వినియోగించక పోవడం సరైంది కాదని అన్నారు. తక్షణమే జిల్లా ప్రజల ఆరోగ్య సేవల కోసం అంబులెన్సులను వినియోగం లోకి తేవాలని డిమాండ్ చేసారు. అలాగే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చలి వేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఐటిడిఎలో చలి వేంద్రం ఏర్పాటు చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు, రేపు సెలవు లేదు: మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: వర్క్ ఫ్రం హోం సర్వే ఈనెల 4వ తేదీ శుక్రవారం లోగా పూర్తి చేయాల్సి ఉందని ఈ సర్వే, మున్సిపాలిటీలోని 15 సచివాలయాలలో ఏ ఒక్క సచివాలయంలోనైనా ఒక్క రికార్డు పెండింగ్లో ఉన్న ఆ సచివాలయ ఉద్యోగులు శని ఆదివారాల్లో అందరూ కూడా తప్పకుండా విధులకు హాజరై రికార్డులు పూర్తి చేయవలసి ఉందని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. రికార్డు పెండింగ్లో ఉన్న సచివాలయాలను సంబంధిత అధికారులు శని ఆదివారాల్లో ఏ సచివాలయంలను అయినా ఆకస్మికంగా తనిఖీ చేసే అవకాశం ఉందన్నారు. ఆ సమయంలో అక్కడ ఉద్యోగులు సర్వే చేయడం లేదని తెలిస్తే వెంటనే వారిపై తీవ్రమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. కావున అందరూ ఈ విషయాన్ని గమనించి సమన్వయంతో సర్వే పూర్తి చేయాలని కోరారు.

మల్లవరంలో వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర - మోతుగూడెం: మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన మెడికల్ ఆఫీసర్ డా. ప్రజ్ఞ మోతుగూడెం ప్రాథమిక కేంద్రానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్లవరం గ్రామాన్ని సందర్శించారు. ప్రజలు ఆరోగ్య కేంద్రానికి రావడం విషయంలో నిరాకరణ చూపడం, అనారోగ్య

పరిస్థితులపై అప్రమత్తత లేకపోవడం నేపథ్యంలో ఈ విజిట్ ఏర్పాటు చేసినట్టు డాక్టర్ ప్రజ్ఞ తెలియజేశారు. ఈ సందర్శనలో 3 సంవత్సరాల చిన్నారి జ్వరంతో బాధపడుతూ చెట్టు కింద పడుకొని ఉండగా ఆమెను పరిశీలించి మలేరియా పాజిటివ్‌గా గుర్తించారు. తల్లికి టెపిడ్ స్పాంజింగ్ (తడిపిన గుడ్డతో శరీరం తుడవడం) విధానం వివరించారు. అలాగే మలేరియా వంటి వ్యాధులకు సమయానికి ఆసుపత్రిలో చికిత్స తీసుకోవడం ఎంత కీలకమో వివరించారు. ఆరోగ్య సమస్యల విషయంలో నిర్లక్ష్యం ప్రాణాపాయంగా మారవచ్చని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్థులకు వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. శరీరంలో ఎటువంటి చిన్నపాటి లక్షణాలు కనిపించినా వెంటనే ప్రాథమిక కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దోమలు వల్ల వ్యాప్తిచెందే వ్యాధులు నివారణకు దోమదాడిని తగ్గించే చర్యలు తీసుకోవడం, మస్కిటో నెట్లు వాడడం, రాత్రిపూట మూత పెట్టిన భోజన జాడీలు వాడటం ముఖ్యమని వివరించారు.

విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలి

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలోని ఎస్.అన్నమయ్య అనే డ్రాప్ అవుట్ విద్యార్థిని బూర్జ ఉన్నత పాఠశాలలో తిరిగి చేర్పించడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి-2 వెంకట రమణ తెలిపారు. ఆయనతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు సిఆర్పీలు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల గ్రామ సభలు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, చింతూరు వారి అదేశములు మేరకు శుక్రవారం మండలంలో పోలవరం ఆర్ అండ్ ఆర్ గ్రామ సభలు అధికారులు నిర్వాసిత ప్రజల సమక్షంలో నిర్వహించారు. మండలంలోని సోముల గూడెం,

శబరిరావిగూడెం, కోప్పల్లి, ధర్మ తాళ్ల గూడెం, రాజుపేట, కన్నాయిగూడెం గ్రామ ఆర్ అండ్ ఆర్ లబ్ధిదార్ల అర్హత కలిగి ఉండి ఈరోజు గ్రామ సభ లో చదివిన అర్హులైన లబ్ధిదారుల జాబితాలో గ్రామం లో నివాసం ఉండి పేరు లేనివాళ్లు ఉంటే వాళ్ళు గ్రామ సభ జరిగిన రోజు నుండి అనగా ఈరోజు నుండి 15 రోజుల వరకు మీ కు కలిగిన అర్హత రికార్డు తో అనగా ఆధార్, కుల ధ్రువీకరణ, బ్యాంకు ఎకౌంటు కాఫీ , రేషన్ కార్డు కాఫీ ఇంటి పన్ను రసీదు, ఓటర్ ఐడి కార్డు లతో 15 రోజుల వరకు దరఖాస్తులు ఐటీడీఏ చింతూరు నందు, తహసీల్దార్ కార్యాలయం నందు దరఖాస్తు చేసుకొనవలసిందిగా కోరడమైనదనీ తహసీల్దార్ ఓ ప్రకటనలో తెలిపారు.

సెకండ్ గ్రేడ్ టీచర్ పరీక్షకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలో వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా బలహీన వర్గాల అభ్యర్ధులకు సెకండ్ గ్రేడ్ టీచర్ పరీక్షకు ఉచిత శిక్షణ కొరకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఇ. అప్పన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిఎస్సి పరీక్షకు ఆన్లైన్ ద్వారా శిక్షణా తరగతులను నిర్వహిస్తామన్నారు. డిఎస్సి పరీక్షకు ఆన్లైన్ ద్వారా శిక్షణకు ధరఖాస్తు చేయు అభ్యర్ధులు డిగ్రీ మార్క్ లిస్ట్, కుల, ఆదాయ, స్థానికత తెలిపే ధ్రువీకరణ పత్రాలు, డిఎస్సికి ఎంపికైన అభ్యర్ధులు టిఇటి (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) మార్క్ లిస్ట్ జిరాక్స్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు ధరఖాస్తుతో జత చేయాలన్నారు. పూర్తి చేసిన ధరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయం, ఆర్సియం స్కూల్, రూం నెంబర్.8 మొదటి అంతస్తు, ఆర్టీసీ బస్ స్టాండ్ ఎదురుగా, పార్వతీపురం మన్యం నందు సమర్పించవలెనని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు: 9701786751, 9700112711ను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

సచివాలయ ఉద్యోగుల పనితీరు అధ్వానం: ఎమ్మెల్యే విజయ్ చంద్ర

విశాలాంధ్ర - పార్వతీపురం: బలిజిపేట మండలంలోని వంతరాం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆకస్మికంగా సందర్శించారు. ఆయన తనిఖీచేసిన సమయంలో సచివాలయంలో 14మంది ఉద్యోగులుకు గాను ఒక్కరుమాత్రమే విధుల్లో ఉండడంతో ఆయన అక్కడి ఉద్యోగుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడి నుంచే ఆయన ఎంపీడీఓతో ఫోన్లో మాట్లాడి గైర్హాజరు ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, విధులకు హాజరుకానివారికి మెమోలు కూడా ఇవ్వాలని ఆదేశించారు.దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు చేపడతామని ఆయన ఎంపీడీవోకు తెలిపారు. పనిచేయని ఉద్యోగులను ఇక్కడనుంచి వేరొకచోటకు పంపించేయాలని, ఇలాంటి ఉద్యోగుల వల్ల ప్రజలకు కీడు ఎక్కువగా జరుగుతుందనీ, ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తుందన్నారు. ఉద్యోగుల హాజరుపట్టికూడా అందుబాటులో లేదన్నారు. వారంరోజుల ఉద్యోగుల హాజరు వివరాలను తనకు సాయంత్రంలోగా తెలియజేయాలని ఆయన ఎంపీడీవోకు ఆదేశించారు. జిల్లాలో సచివాలయ ఉద్యోగుల పనితీరుపట్ల అన్ని వర్గాల ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులలో కూడా సరైన భావన లేకపోవడం గమనార్హం. సగం మంది ఉద్యోగులు సచివాలయాలకు రాకుండానే విధులను నిర్వహిస్తున్నారు. ఒక అధికారి అడిగితే ఇంకో అధికారి అనుమతిచ్చారని చెప్పడం పరిపాటైనది. సచివాలయంలోని కొన్నిశాఖల ఉద్యోగులు తమకు గ్రామ సచివాలయంతో సంబంధంలేదని వ్యవహరిస్తున్నారు. సచివాలయాలను పర్యవేక్షించే నాధుడే కూడా కరువయ్యారు. గత ప్రభుత్వంలో వాలంటీర్ల హవాతో, వీరి పనులను వారి చేత చేయించుకొని మమా అనిపించేలా ఉద్యోగాన్ని చేసేవారన్న మాటకూడా ఉంది. ప్రజలకు సచివాలయ ఉద్యోగులు జవాబుదారితనంతో ఉన్నప్పుడు ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పథకాలు సకాలంలో చేరదానికి అవకాశం ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలి మరి.

గిరిజనులకు మాత్రమే సీసీఎల్ఏ జీఓ అమలు చేయాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వంతల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - పాడేరు: ఏజెన్సీలో 1/70 చట్టనికి లోబడి గిరిజనులకుమాత్రమే సీసీ ఎల్ ఏ జీవో ఎమ్ ఎస్ 30 రెగ్యులెసన్ స్కీమ్ 2025 అమలు చెయ్యాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంతల నాగేశ్వర్రావు అన్నారు. శుక్రవారం గెమ్మెలి బొంజుబాబు అధ్యక్షతన పాడేరు సిల్వర్ నగర్ కార్యాలయం లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలొ నాగేశ్వర్రావు మాట్లాడుతు ఆంధ్రప్రదేశ్ 5వ షెడ్యూల్ ప్రాంతంలో ల్యాండ్ రెగ్యులెసన్ యాక్ట్ 1970 అమలులో ఉన్నందున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన సీసీఎల్ ఏ జీవో ఎమ్ ఎస్ 30 ఏజెన్సీలో గిరిజనులు కు మాత్రమే వర్తించేలా ఆదేశాలు ఇవ్వాలని 5వ షెడ్యూల్ ప్రాంతం అల్లూరి జిల్లా వ్యాప్తంగా టూరిజం ప్రాంతం అనంతగిరి, అరకు, దుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జి కె వీధి, కొయ్యూరు, రాజఒమ్మంగి, గంగవరం, చోడవరం, మారేడుమిల్లి మండలంలలో రోడ్డుకు ఇరువైపుల ప్రభుత్వ ఆర్ అండ్ బి భావనముల స్థలలు పైన రెవిన్యూ పంచాయతీ రాజ్ శాఖ వారి అనుమతులు లేకుండనే గిరిజనేతరులు వాణిజ్యసముదాయలు నివాస గృహములు నిర్మించి ఉన్నారని అట్టి నిర్మాణంలు 1/70 భూ బదలైంపు చట్టం అతిక్రమణ జరిగిందని సీసీఎల్ఏ జీవో ఎంఎస్‌కి వ్యతిరేకమన్నారు. దీనిపై రెవిన్యూ, పంచాయతీ రాజ్ శాఖ ఎటువంటి నివారణకు చర్యలు తీసుకొని ఉండలేదని ఇలాంటి నిర్మాణం వలన రాబోయే రోజుల్లో పట్టణ అభివృద్ధికి ఆటంకము ఏర్పడుతుందన్నారు.నాన్ ట్రైబల్ ఆక్రమణలు లో ఉన్న వ్యాపారసముదాయలు అధికారులు స్వాదిన పరిచ్చుకొని గిరిజననిరుద్యోగులు కు ఉపాధి కల్పించినట్లయితే ఏజెన్సీ లో నిరుద్యోగ సమస్యలు తలెత్తవని కావున అల్లూరి జిల్లా కలెక్టర్ 1/70 సీసీఎల్ఏ జీవో 30 అనుసరించి పైన తెలిపినమండలాలలో ప్రభుత్వ ఆర్ ఎం బి స్థలము లో ఉన్న అక్రమ నిర్మాణం లను కూల్చివెయటకు ఆదేశములుఇవ్వాలని వినతిపత్రం సమర్పించడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళ నాయకులు కొర్ర మల్లమ్మ డివిజన్ నాయకులు గెమ్మెలి బొంజుబాబు, కిల్లో రాజారావు, వంతల శ్రీను, సోకెలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లాను ఆర్గానిక్ జిల్లాగా మార్చేందుకు సమిష్టిగా కృషి చేద్దాం

వ్యవసాయ సహాయ సంచాలకురాలు జాహ్నవి

విశాలాంధ్ర - చింతపల్లి:- అల్లూరి జిల్లాను ఆర్గానిక్ జిల్లాగా మార్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న ఆలోచనను అన్ని శాఖల సమన్వయంతో వ్యవసాయ శాఖ, రైతు సాధికారత సంస్థ వెలుగు, మండల పరిషత్ ల ఆధ్వర్యంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు శుక్రవారం మండల సాధికారత సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు జాహ్నవి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపిఎం. శ్రీనివాస్ లు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ ప్రణాళిక పై వచ్చే 2026-27 ఏడాదికి అల్లూరి జిల్లా ను ఆర్గానిక్ జిల్లా గా రూపొందిచాలన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు యొక్క విజన్ మేరకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో ప్రణాళిక లు తయారు చేసి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాలు మేరకు చింతపల్లి మండల స్థాయిలో రైతులతో అనుసంధానంగా పని చేసే క్యాడర్ తో ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. రైతులను పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయం వైపు మారేలా మరింత మెరుగైన ప్రణాళికలతో రైతుల దగ్గర వెళ్లాలని ఈ సందర్భంగా ఆయా శాఖల ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, అందుకు తమ శాఖలన్నీ పూర్తి స్థాయిలో సహకరిస్తాయని వారు భరోసా ఇచ్చారు. నవధాన్యాలు సాగు నేలకి ఎంతో ఉపయోగకరమని అందుకు కావలసిన 32 దేశివాలి విత్తన రకాలను తీసుకొని తొలికరి చినుకులలో రైతులచే వేయించాలని చెప్పారు. రైతులకు అవగాహనా కోసం వ్యవసాయం లో ఉన్న పద్ధతులను పండించి చూపించడం కోసం దగ్గర లో ఉన్న వ్యవసాయ స్థలం ను ఉపయోగించుకోమని జాహ్నవి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సి ఎన్ ఎఫ్ డివిజన్ ఇంచార్జ్ వెంకటరమణ చింతపల్లి యూనిట్ ఇంచార్జ్ కొర్ర మోహన్ రావు, అన్నవరం కిల్లో మోహన్ రావు, సుభద్ర, ఆనందరావు, కాసులమ్మ, రంగారావు, ఆదినారాయమ్మ, సూర్యనారాయణ, మండల ఐ సి ఆర్ పి లు, వీహెచ్ఏ, వీ ఎ ఎ లు, ఎంపీఈవో లు, వివో ఏ లు వివో ఓబి లు హాజరయ్యారు.

ఎమ్మెల్యే రేగం మత్యలింగంకు ఆర్.ఎం.పి వైద్యుల బృందం ఘన సత్కారం

విశాలాంధ్ర,అరకులోయ: అరకులోయ శాసనసభ్యులు రేగం మత్స్య లింగమును అల్లూరి సీతారామరాజు జిల్లా ఆర్ఎంపి వైద్యుల బృందం ఘనంగా సన్మానించింది.మండలంలోని పద్మాపురం గ్రామంలో ఉన్న ఉషోదయ ప్రైవేట్ రిసార్ట్స్ లో శుక్రవారం ఐశ్వర్య సంతోనోత్పత్తి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేగం మత్యలింగం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంతానోత్పత్తి, ఇతర సమస్యలపై మహిళలు పురుషులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆర్.ఎం.పి వైద్యుల బృందం ఇటువంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అన్నారు. సంతాన ఉత్పత్తి అవగాహన కార్యక్రమాల వలన మహిళలు పురుషులు చైతన్యవంతులై సంతానానికి సంబంధించి సమస్యలను పరిష్కరించుకోగలుగుతారని ఆయన అన్నారు.ఈ సంతాన ఉత్పత్తి అవగాహన కార్యక్రమంలో డాక్టర్ డి.పైడిరాజు, డాక్టర్ శ్రావణి పాల్గొని శిబిరంలో పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.అంతకుముందు శాసనసభ్యులు రేగం మత్స్య లింగమును అల్లూరి జిల్లా ఆర్.ఎం.పి వైద్యుల బృందం సభ్యులు కిరణ్, కామేష్ , తాతబాబు,రాజు,మోహన,ఇతర సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పద్మాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలీ సుస్మిత,ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షులు కమ్మిడి అశోక్, సూపర్ ఎంపీటీసీ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిషోర్ వికాసం, బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర - చింతపల్లి: - కిషోర్ వికాసం, బాల్య వివాహాలు పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఐ సి డి ఎస్ సిడిపిఓ జి వి రమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ వసతి గృహ పాఠశాలలో కిషోర్ వికాసం..బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు..ఈ సందర్భంగా సిడిపిఓ రమణ మాట్లాడుతూ ప్రధానంగా కిషోర బాలికలకు బాల్య వివాహాల వలన కలిగే అనర్ధాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో ఏ టి డబ్ల్యు ఓ బలిరెడ్డి నాగ జయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు, కొండలరావులు మాట్లాడుతూ కిషోర్ బాలికలకు, మానసిక, శారీరక అవగాహన అవసరమన్నారు. బాల్యవివాహాల పై జరుగుతున్న అనర్ధాల పై అవగాహన పెంచుకోవాలని వారు సూచించారు. అనంతరం కార్యక్రమం పై భారీ ర్యాలీ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఏ సి డి పి ఓ ఎం.రామలక్ష్మి, సూపర్వైజర్స్ కె.విజయ కుమారి, ఎస్ కే గౌహరున్నిసా, పి.అప్పల నర్సమ్మ, ఎస్ గౌరీ, స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు, ఎం ఎస్ కే తదితరులు పాల్గొన్నారు

శంబర హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - మక్కువ: ఆరాధ్య దేవత కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి ఉత్తరాంధ్రలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా ఎంతో భక్తితో వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ ఏడాది శ్రీ సంబర పోలమాంబ అమ్మవారి పది మంగళ వారాల జాతర ఆదాయం 1 కోటి 7లక్షల 44వేల 975 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్య నిర్వాహక అధికారి వి.వి. సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. శీఘ్ర దర్శనం 100 రూపాయలు టికెట్ ద్వారా 17 లక్షల 30 వేల రూపాయలు, ప్రత్యేక దర్శనం 20 రూపాయల టికెట్ ద్వారా 7 లక్సల 28 వేల రూపాయలు, కేశఖండన ద్వారా 78 వేల960 రూపాయలు, మహా అన్నదాన విరాళాల ద్వారా 9 లక్సల 91 వేల 426 రూపాయలు, లడ్డు ప్రసాదం ద్వారా 7 లక్సల 77 వేల 555 రూపాయలు, పులిహొర ప్రసాదం ద్వారా 5లక్సల 66 వేల 150 రూపాయలు, కొబ్బరి ముక్కలు వేలం ద్వారా 5 లక్షలు, చీరలు, రవికలు, ఇత్తడి సామగ్రి ద్వారా 3 లక్సల 2వేలు, తలనీలాలు వేలం ద్వారా 3 లక్సల 37 వేల 600 రూపాయలు, వనమగుడు వద్ద దీపముల వేలం ద్వారా 70 వేల రూపాయలు, లామినేషన్ ఫోటోలు వేలం ద్వారా 1లక్స 52 వేలు, హుండీల ద్వారా ఆదాయము 45 లక్సల 11 వేల 284 రూపాయలు తో కలిపి మొత్తము 1 కోటి 7లక్షల 44వేల 975రూపాయలు వచ్చినట్లు వెల్లడించారు. గత సంవత్సరం కంటే ప్రస్తుత సంవత్సరం 12 లక్సల 1 వెయ్యి 542 రూపాయల ఆదాయం తగ్గిందని తెలిపారు.

తూతూ మంత్రంగా ముగిసిన సమావేశం

చర్చకు రాని ప్రధాన సమస్యలు

మండల అభివృద్ధి ప్రధానం: ఎంపిపి శోభారాణి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో

మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపిపి ఎం.శోభారాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పూర్తిస్థాయిలో ప్రజాప్రతినిధులు గాని, అధికార యంత్రాంగం గాని రాకపోవడంతో నామమాత్రంగా తూతూ మంత్రంగా సమావేశం ముగించారు. ప్రధానంగా వేసవిలో జరుగుతున్న క్రాస్ ప్రోగ్రాం గాని, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సూర్య ఘర్ పథకం పైగాని, గ్రామస్థాయిలో జరుగుతున్న పల్లె పండుగ పనుల పురోగతిపై గాని సంబంధిత శాఖ అధికారులు గైర్హాజరావడంతో పూర్తి సమాచారం లేక చేసేది లేక సభ్యులు ముఖాలు చూసుకున్నారు. ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ కాలనీలకు 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇస్తుందని అయితే ఇందుకు సంబంధించి వినియోగదారుడు పూర్తి సమాచారం కుల ధ్రువీకరణ పత్రం ఆధార్ కార్డు ఆన్లైన్లో సమర్పించాలని విద్యుత్ శాఖ ఏఈ కోరారు. ఇప్పటివరకు మండల పరిధిలో కేవలం 25 మంది మాత్రమే ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఈ సమావేశానికి ఎంపిడిఓ రమేష్, వైస్ ఎంపీపీలు, ఈఓ పిఆర్డి, ఎంపిటిసిలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

రామాలయంలో ముహూర్తపు రాట

విశాలాంధ్ర - చింతపల్లి: మండల కేంద్రంలోని స్థానిక రామాలయంలో ఈనెల 6 తేదీ జరిగే సీతారాముల కళ్యాణం కోసం పందిరి ముహూర్తపు రాటను ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు రామాలయ ఆలయ ధర్మకర్త మాదాబత్తుల సత్తిబాబు, ముత్యాలమ్మ జాతర ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు ల ఆధ్వర్యంలో భక్తులు ముహూర్తపు రాట వేశారు. అధిక సంఖ్యలో మహిళలు ఈ కార్యక్రమంలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ప్రతి ఏటా శ్రీరామ నవమి రోజున నిర్వహించే సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించేందుకు స్థానిక ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు, మాదాబత్తుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పూర్ణచంద్రరావుకు మెరుగైన వైద్య సేవలు అందించండి

విశాలాంధ్ర - చింతపల్లి: అస్వస్థతకు గురైన తెదేపా మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు త్వరగా కోలుకోవాలని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. పార్టీ సమావేశాలు దృష్ట్యా అధికంగా తిరగడంతో అస్వస్థతకు గురైన ఆయన గత నెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవం లో పాల్గొని అస్వస్థతకు గురి కావడంతో పార్టీ శ్రేణులు ఆయనను చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్లేట్లెట్స్ క్షీణించడంతో స్థానిక వైద్యులు ఆయనకు మెరుగైన వైద్య సేవలు అవసరమైన భావించి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో శుక్రవారం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఆయనను గిడ్డి ఈశ్వరి పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. పూర్ణచంద్రరావు యొక్క ఆరోగ్య పరిస్థితి పై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పూర్ణచంద్రరావు సతీమణి, మాజీ సర్పంచ్ ఊర్మిళతో పూర్ణచంద్రరావు ఆరోగ్య పరిస్థితి పై అధైర్య పడవద్దని, మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా వైద్యులతో మాట్లాడడం జరిగిందని, ఆయన త్వరగా కోలుకుంటారని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆండ్రాబు లక్ష్మణ్, జీ. అబ్బాయి నాయుడు, షేక్ ఖాసిం వల్లి, కేశవ నాయుడు, యశ్వంత్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.